క్లుప్తంగా

మినీ స్టేడియం కోసం ఐదెకరాల స్థలం కేటాయింపు

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలో మినీ స్టేడియం ఏర్పాటు కోసం యువత కొన్నేళ్ల నుంచి ఎదురు చూస్తున్నారు. శాసన సభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మదన్‌మోహన్ రావు.. తనను గెలిపిస్తే మినీ స్టేడియం ఏర్పాటు చేయిస్తానని యువతకు హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన హామీ మేరకు మండల కేంద్రం శివారులో ఐదెకరాల స్థలాన్ని మంజూరు చేయించారు. దీనికి సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసిన భూమి అనుమతి పత్రాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులకు పంపించారు. దీంతో గ్రామ మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్, మాజీ ఎంపీటీసీ తూర్పు రాజు.. మండల యువత, మండల ప్రజల తరఫున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్‌చార్జి పశువైద్యుడిగా పండరీనాథ్



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని పశువైద్యశాలలో వైద్యులు రాక పశువులకు వైద్యం అందడం లేదని బుధవారం పశుపోషకులు, రైతులు పశువైద్యశాల ముందు ధర్నా చేశారు. ఈ కథనం సాక్షిలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి శుక్రవారం ఈ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న మణికుమార్‌ను మేనూర్‌కు బదిలీ చేసి జుక్కల్‌లో విధులు నిర్వహిస్తున్న పండరీనాథ్‌కు పెద్దకొడప్‌గల్‌కు ఇన్‌చార్జి వైద్యులుగా నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ముదిరాజ్ పండగ సాయన్న జయంతికి సెలవు ప్రకటించాలి



ఎల్లారెడ్డి: ముదిరాజ్ బిడ్డ పండగ సాయన్న జయంతికి ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని ముదిరాజ్ సంఘం నాయకులు కుడుముల సత్యనారాయణ, ప్యాలాల రాములు అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలోని ముదిరాజ్ సంఘం వద్ద ముదిరాజ్ బిడ్డ పండగ సాయన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 150 ఏళ్ల క్రితం నిజాం రాజులతో పోరాటం చేసిన పండగ సాయన్న విగ్రహాన్ని ట్యాంకు బండ్‌పై పెట్టాలని వారు కోరారు. ముదిరాజ్ సంఘం నాయకులు శ్రీకాంత్, ప్రకాష్, సాయిరాం తదితరులున్నారు.

రైతులకు శిక్షణ తరగతులు



లింగంపేట(ఎల్లారెడ్డి): ఈ నెల 22 నుంచి రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం లింగంపేట రైతు వేదికలో ఆయన మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించినట్లు పేర్కొన్నారు. రైతు శిక్షణ తరగతులకు ప్రతి గ్రామం నుంచి భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు తప్పకుండా హాజరు కావాలని కోరారు. శిక్షణ తరగతులను లింగంపేట సమీపంలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తామన్నారు. సీజీఆర్ఎఫ్ మెంబర్ రాజాగౌడ్, లింగంపేట మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, కార్యదర్శి వెంకట్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

సస్య రక్షణ చర్యలు పాటించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): రైతులు పంటల సాగులో సస్య రక్షణ చర్యలు పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ..ఆలయ ఆవరణలో గ్రామం చిత్ర పటం వేసి , వివిధ రకాల పంటల భూముల గురించి వివరించారు. విద్యార్థులు , ఏవో ప్రజాపతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీనవదుర్గ వ్రతం

కామారెడ్డి అర్బన్: స్థానిక శారదామాతా ఆలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం ఉదయం 11 గంటలకు శ్రీనవదుర్గా వ్రతం, కుంకుమార్చన, సౌభాగ్యం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అడవిని తలపించేలా కార్యాలయం

- పాములు, విష పురుగులకు ఆవాసంగా మారిన వైనం
- సమీప నివాసాల్లోకి చొరబడుతున్న పాములు
- పట్టించుకోని అధికారులు



భిక్కనూరు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఆవరణలో పెరిగిన చెట్లు, ముళ్లపొదలు

భిక్కనూరు: మండల కేంద్రంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ప్రాంగణమంతా ముళ్లపొదలతో నిండి పోయింది. మూడేళ్లుగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయాన్ని అధికారులు శుభ్రం చేయించడం మర్చిపోయారు. దీంతో ఈ కార్యాలయం ప్రాంగణమంతా చెట్లు, ముళ్ల పొదలు పెరిగాయి. అడవి మాదిరిగా చెట్లు ముళ్లపొదలు ఉండడంతో ఇందులో విష పురుగులు ఆవాసం ఏర్పరుచుకున్నాయి. దీని వల్ల బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్నవారు ఇబ్బందులకు గురవుతున్నారు. పాములు, తేళ్ల వంటి విషపురుగులు బీఎస్ఎన్ఎల్ ప్రాంగణం నుంచి బయటకు వచ్చి సమీపంలో ఉన్న ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి. చెట్లు భారీగా పెరగడంతో ప్రహరీ కూడా పలు చోట్ల కూలిపోయింది. చెట్లు, ముళ్లపొదలను తొలగించాలని బీఎస్ఎన్ఎల్ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడంలేదని ఆ ప్రాంతం ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారుల స్పందించి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ప్రాంగణాన్ని శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యాలయంలో ప్రస్తుతం ఆధార్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఆధార్ కేంద్రానికి వెళ్లే ప్రజలకు పలుమార్లు విషపు పురుగులు, పాములు కనిపించడంతో వారు ఈ ఆధార్ కేంద్రం వైపునకు వెళ్లేందుకు భయపడుతున్నారు.

ప్రతి రోజూ భయంతో బతుకుతున్నాం



బీఎస్ఎన్ఎల్ ఆఫీసు మొత్తం చెట్లతో నిండిపోయింది. ఇందులో నుంచి పాములు విచ్చలవిడిగా బయటకు వస్తున్నాయి. ఇళ్లలోకి వస్తున్నాయి. ప్రతిరోజు భయం భయంగా బతుకు తున్నాం. వెంటనే ఈ ఆఫీస్‌ను శుభ్రం చేయించాలి.

–కోరె లక్ష్మి, భిక్కనూరు

బస్టాండ్ రూపురేఖలు మార్పు

- తల్లిదండ్రుల పేరిట రూ.1.25 లక్షలు వెచ్చించిన యువకుడు
- జిగేల్‌మనేలా తీర్చిదిద్దిన పెద్దబచ్చగారి జ్ఞానప్రకాశ్‌రెడ్డి



రంగులు వేయించి, విద్యుత్ దీపాలు అమర్చడంతో జిగేల్ మంటున్న భిక్కనూరు బస్టాండ్

భిక్కనూరు: రంగులు వెలిసిపోయి, విద్యుత్ దీపాలు సరిగా వెలగకపోవడం, ప్రయాణికులు కూర్చునేందుకు సరైన వసతి లేకపోవడంతో పాటు స్లాబ్ పెచ్చులూడటం, టైల్స్ కూడా పలిగిపోయి ఉన్న బస్టాండ్‌ను ఒక యువకుడు ముందుకు వచ్చి తన తల్లిదండ్రుల పేరిట బస్టాండ్‌ను తీర్చిదిద్దిన సంఘటన భిక్కనూరు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన పెద్దబచ్చగారి జ్ఞానప్రకాశ్‌రెడ్డి అనే యువకుడు భిక్కనూరు బస్టాండ్ దుస్థితిని చూసి స్పందించారు. బస్టాండ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని తెలుసుకుని తానే ముందుకు వచ్చాడు. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు అని చూడకుండా జ్ఞానప్రకాశ్‌రెడ్డి శిథిలావస్థకు చేరుకున్న బస్టాండ్‌ను తీర్చిదిద్దాడు. బస్టాండ్‌కు రంగులు వేయించడం, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడం, ఫ్లాట్‌ఫారం మరమ్మతులు, సీసీ మరమ్మతులు, మొక్కలను నాటడం, బస్టాండ్ ప్రాంగణంలో మొరం పోయించడంతో పాటు ప్రయాణికులు కూర్చునేందుకు సిమెంట్ బల్లాలను కూడా ఏర్పాటు చేసి పలువురితో శభాష్ అనిపించుకున్నాడు. తన తల్లి కౌసల్యదేవి తండ్రి బాగారెడ్డిల పేరిట ఈ అభివృద్ధి పనులను చేపట్టి ప్రజల మన్ననలను పొందాడు.

బస్టాండ్ దుస్థితిని చూసి అభివృద్ధి చేయించా



నెలరోజుల క్రితం భిక్కనూరు బస్టాండ్‌కు వెళ్లాను. అక్కడ పరిస్థితి చూసి చాలా బాధపడ్డా. ఎవరూ పట్టించుకోవడం లేదని తెలుసుకుని నేనే ముందుకు వచ్చి సొంత డబ్బులు రూ.1.25 లక్షలు వెచ్చించి బస్టాండ్‌ను తీర్చిదిద్దాను.

– పి.జ్ఞానప్రకాశ్‌రెడ్డి, భిక్కనూరు

సమయపాలన పాటించని సొసైటీ సిబ్బంది

- ఇబ్బందులు పడుతున్న రైతన్నలు



మాచారెడ్డి సొసైటీ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

మాచారెడ్డి: ఎరువుల కోసం మాచారెడ్డి సొసైటీ వద్దకు వచ్చిన పలు గ్రామాల రైతులకు కార్యాలయం మూసి ఉండడంతో ఏం చేయాలో అర్థం కాలేదు. ఉదయం 11 గంటలు దాటినా సిబ్బంది రాకపోవడంతో రైతులు ఆగ్రహించి ఆందోళనకు దిగారు. ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఫోన్‌లు చేసినా సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 8 గంటల వరకు ఎరువుల కోసం వచ్చామని, 12 గంటలు దాటినా సొసైటీ సిబ్బంది రాకపోవడం, కార్యాలయం తెరవక పోవడంతో తమ పనులకు ఆటంకం ఏర్పడిందని వాపోయారు. తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ రైతులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

కేంద్ర ప్రభుత్వమే బీసీలకు వ్యతిరేకం



లింగంపేట(ఎల్లారెడ్డి): కేంద్ర ప్రభుత్వమే బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని మైనార్టీ నాయకుడు ఫతియొద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన లింగంపేటలో మాట్లాడారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వమే తమ వైఖరి చెప్పాలని డిమాండు చేశారు. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే కేంద్రంలో అధికారం కోల్పోతామని బీజేపీ ప్రభుత్వం భయపడుతుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఓడిపోతామనే భయంతో అనవసర రాద్ధాంతం చేస్తున్నాయన్నారు.

అన్ని సేవలు ఒకే చోట అందేలా చర్యలు



మత్తమాల పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న ఆర్డీవో పార్థసింహారెడ్డి

ఎల్లారెడ్డిరూరల్: ఆస్పత్రిలో అన్ని రకాల సేవలు ఒకే చోట అందేలా చర్యలను తీసుకోవాలని ఆర్డీవో పార్థసింహారెడ్డి, పీహెచ్‌సీ సిబ్బందికి సూచించారు. ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల పీహెచ్‌సీని ఆర్డీవో పార్థసింహారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆస్పత్రిలోని మందులు, వార్డులను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వస్తున్న రోగులకు అందుతున్న వైద్యం గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జంగమాయిపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. పనులు వేగంగా జరగాలని ఆయన లబ్ధిదారులకు సూచించారు. ఎంపీడీవో ప్రకాష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, ఆరోగ్య సిబ్బంది తదితరులున్నారు.

అల్మాజీపూర్‌లో హెల్త్ సర్వే

ఎల్లారెడ్డిరూరల్: అల్మాజీపూర్‌లో మత్తమాల పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం హెల్త్ సర్వే నిర్వహించారు. గ్రామానికి చెందిన ఇందిరవ్వ అనే మహిళకు డెంగీ పాజిటివ్ రావడంతో ఆరోగ్య సిబ్బంది 50 కుటుంబాలకు హెల్త్ సర్వే నిర్వహించారు. దోమలు వృద్ధి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారికి అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ సిబ్బంది గోవిందరెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులున్నారు.

బాన్సువాడలో ఒకరికి డెంగీ

బాన్సువాడ: బాన్సువాడ పట్టణానికి చెందిన కొండ శోభ అనే మహిళకు డెంగీ సోకినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం శోభ నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతోంది. తెల్ల రక్తకణాలు పూర్తిగా తగ్గిపోయినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి



బీబీపేట: వాహనదారులు సరైన ధ్రువపత్రాలు ఉంచుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని ఎస్సై ప్రభాకర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. అంతే కాకుండా ఓవర్‌లోడ్‌తో వెళ్లరాదని, ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా నిర్మించుకోవాలి



కన్‌కల్ జీపీలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

తాడ్వాయి (ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని పారదర్శకంగా నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి శివ కుమార్ అన్నారు. దేమికలాన్, కన్‌కల్, కరడ్ పల్లి గ్రామాలలో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. అలాగే గ్రామంలో తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జీపీ కార్యాలయాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్(జుక్కల్): ఒడ్డేపల్లి, మల్లూర్ గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శుక్రవారం స్థానిక ఎంపీడీవో గంగాధర్ భూమిపూజ నిర్వహించారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు గృహ నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలని సూచించారు. నాయకులు ప్రజా పండరి, శ్రీనివాస్ తదితరులున్నారు.

విద్యుత్ మరమ్మతులు సొంతంగా చేసుకోవద్దు



మాచారెడ్డి: వర్షాకాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తినపుడు రైతులు సొంతంగా విద్యుత్ మరమ్మతులు చేసుకోవద్దని ట్రాన్స్‌కో డీఈ కల్యాణ్ చక్రవర్తి సూచించారు. శుక్రవారం మాచారెడ్డి మండల కేంద్రంలో నిర్వహించిన పొలంబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏ సమస్య తలెత్తినా తమ సిబ్బందికి సమాచారం అందిస్తే అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వర్షాల కారణంగా స్టార్టర్ తడిసి ఉంటుందని, టెస్టర్‌తో పరీక్షించిన అనంతరమే తెరవాలన్నారు. ఏడీఈ నరేశ్, మాచారెడ్డి ఏఈ తిరుపతిరెడ్డి, సీనియర్ లైన్‌మెన్ రవీందర్, లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, లైన్‌మన్ యూనస్, అసిస్టెంట్ లైన్‌మన్ చంద్రకాంత్, రైతులు ఉన్నారు.

గుజ్జుల్ డ్యాం ఎడమ కాలువ తూముకు గండి



వృథాగా పోతున్న నీరు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గుజ్జుల్ తండా సమీపంలో ఉన్న గుజ్జుల్ డ్యాం ఎడమ కాలువ తూముకు గండి పడి నీరంతా వృథాగా పోతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి డ్యాంలోకి భీంరావు గుట్ట వాగు వరద వచ్చి చేరుతుంది. దీంతో డ్యాంలో నీరు నిండుతుందని ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాని డ్యాం ఎడమ కాలువ తూముకు గండి పడి నీరు వృథాగా పోతోంది. నీరంతా కాలువ కింద ఉన్న పంట పొలాల్లోకి చేరి రైతులకు నష్టం కల్గుతుంది. గమనించిన తండావాసులు గండిని పూడ్చే ప్రయత్నం చేసినా ఫలితంగా లేకుండా పోయింది. నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా ఏఈ వంశీకృష్ణ తూమును పరిశీలించారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



లింగంపేట బస్టాండ్‌లో ప్రయాణికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న షీ టీం బృందం

లింగంపేట(ఎల్లారెడ్డి): సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని షీటీమ్ బృందం సభ్యులు శుక్రవారం లింగంపేట బస్టాండులో ప్రయాణికులకు ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు షీటీమ్ అంటే ఏమిటి.. వారు ఎలా పని చేస్తారు..అని వివరించారు. ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాలకార్మికులు, పని వేధింపులు తదితర విషయాల గురించి వివరించారు. విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తే వెంటనే సైబర్ టోల్ ఫ్రీ నంబర్ 1930కు, 100 నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలన్నారు. షీటీమ్ నంబర్ 8712686094, భరోసా ఫోన్ నంబర్ 8712686096 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. లింగంపేట ఎస్సై దీపక్‌కుమార్, షీటీం సభ్యులు వీసీ శ్రీనివాస్, సుప్రజ, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, శేషారావు పాల్గొన్నారు.

ఘనంగా వరలక్ష్మి వ్రతం



బాన్సువాడ సరస్వతి శిశు మందిరంలో వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళలు

జిల్లా వ్యాప్తంగా మహిళలు శుక్రవారం వరలక్ష్మి వ్రతం పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వరలక్ష్మి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్తయిదువులకు ఇళ్లకు పిలిచి వాయినాలను అందించారు. పలు చోట్ల సామూహిక వ్రతాలు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



మహమ్మద్ నగర్‌లో



బేగంపూర్ గ్రామంలో..



మాచారెడ్డిలో..



మద్నూర్‌లో సామూహిక వ్రతాలు ..



లింగంపేట వేంకటేశ్వర కళ్యాణ మండపంలో..

వరి పంట పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని రాంపూర్‌గడ్డ తండా శివారులో శుక్రవారం క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించినట్లు ఏవో రాజలింగం తెలిపారు. వరి పైరును కాండం తొలిచే పురుగు ఆశించినట్లు గుర్తించినట్లు తెలిపారు. దీని నివారణకు లాంబసైహాలోత్రిన్ 2.5 ఈసీ 200 మి.లీ. ఎకరానికి లేదా క్లోరాంత్రనిల్‌ప్రోల్ 80 మి.లీ. ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఆయనతో పాటు ఏఈవోలు, రైతులున్నారు.

సంక్షిప్తం

తాండూర్‌లో వైద్యశిబిరం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్‌లో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లెదవాఖానా వైద్యురాలు అపర్ణ మాట్లాడుతూ.. గ్రామంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందు జాగ్రత్తగా వైద్యశిబిరం నిర్వహించామన్నారు. గ్రామంలో ప్రతిఒక్కరూ సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె చెప్పారు. 89మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని, వారిలో అవసరమైనవారికి మందులను అందజేశామని ఆమె వివరించారు. ఏఎన్ఎం మంగ, ఆశావర్కర్లు సిద్ధవ్వ, మార్తవ్వ, విజయ,ఏసవ్వ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ ఆఫ్ పిట్లం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో ఆప్తాల్మిక్ అసిస్టెంట్ వైద్యుడు హరికిషన్ రావు 65 మందిని కంటి పరీక్షలు నిర్వహించి చికిత్స కోసం 8 మందిని బోధన్ కంటి ఆసుపత్రికి సిఫారసు చేశారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ కిషన్, కార్యదర్శి బాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేర్లు మార్చండి సారూ...!



నస్రుల్లాబాద్: దుర్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమాచార చట్టం–2005 అధికారి మారి ఏళ్లు గడుస్తున్నా కూడా పేరు మార్చడంలో పాఠశాల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతంలో ఇక్కడ ప్రధానోపాధ్యాయులుగా ఉన్న డి.చందర్ ప్రస్తుతం ఎంఈవో ఉన్నారు. పాఠశాల సమాచార అధికారి మారి ఏడాదిన్నర గడిచినా బోర్డుపై పేరు మార్చక పోవడంతో సమాచారం ఎవరిని అడగాలంటూ ప్రజలు అంటున్నారు.

నేడు శబరిమాత ఆశ్రమంలో ఆధ్యాత్మిక జ్ఞాన బోధ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి ఆధ్యాత్మిక జ్ఞాన బోధ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొర్రూర్ జగద్గురు గీతాశ్రమ వ్యవస్థాపకుడు జ్ఞాన చైతన్యానందస్వామి వారితో ప్రవచనం, గీతాపారాయణ కార్యక్రమం ఉంటుందన్నారు.